క్లుప్తంగా

అల్పాహారం ఏర్పాటు



అల్పాహారం వడ్డిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో ఆదివారం జరిగిన వినాయకుడి శోభాయాత్రలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ్యులు మాట్లాడుతూ.. ఏటా జరిగే వినాయకుడి శోభాయాత్రలో తమ వంతుగా అల్పాహారం ఏర్పాటు చేసి ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు.

గుండెపోటుతో సమాజ సేవకుడి మృతి



బందేనవాజ్ (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామానికి చెందిన ఖాజా బందేనవాజ్ (38) ఆదివారం గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మదర్ థెరిసా సంఘం స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సాతనూరు గ్రామ వక్ఫ్ బోర్డు కమిటీ అధ్యక్షుడిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. నాలుగు చిన్న సినిమాల్లో హీరోగా, భక్తి చానల్‌లో ఆర్టిస్టుగా పనిచేసేవాడు. ఆయన ఆకస్మిక మృతితో సాతనూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈయన తమ్ముడు మహ్మద్ కూడా రెండేళ్ల క్రితం గుండెపోటుకు గురై చనిపోయాడు. ప్రస్తుతం నవాజ్ మృతి పట్ల గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు సంతాపం ప్రకటించారు. ఆయనకు భార్య రుక్సానా బేగం, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దేవరగట్టులో విశేష పూజలు

హొళగుంద: ప్రత్యేకత కలిగిన దేవరగట్టులో ఆదివారం పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు జరిగాయి. పూజల్లో భాగంగా ఆలయంలో సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి, ఆకుల అలంకరణ పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాం నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

మాజీ సర్పంచ్ మృతి



అంజనేయులు (ఫైల్)

ఆలూరు: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బోయ అంజనేయులు (79) ఆదివారం మృతి చెందారు. ఆయన 2006 నుంచి 2011 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి పదవి విరమణ పొందారు. చిన్న వయస్సు నుంచి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఆర్ఎంపీగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులకు ప్రాథమిక వైద్య సేవలందించారు. ప్రధానంగా స్థానిక ఉపాధ్యాయనగర్ కాలనీలో సాయిబాబా మందిరం నిర్మాణంలో కీలపాత్ర పోషించారు.ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో ఆస్తి కాజేసేందుకు కుట్ర

కర్నూలు(సెంట్రల్): నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి తన ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్న కర్నూలుకు చెందిన జతరదొడ్డి స్వర్ణలత, ఆమె కుటుంబ సభ్యులు కిష్టఫర్, వెంకన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన బోగోలు లక్ష్మీకాంతరెడ్డి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను కొనుగోలు చేసిన స్థలంలోకి తనను వెళ్లనీయకుండా పైన కనబరచిన వ్యక్తులు అడ్డుకుంటున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. అలాగే తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించేందుకు సహకరించిన రిజిస్ట్రేషన్ శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డుపైనే మురుగు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మద్దికెర: రోడ్లపై మురుగునీరు పారితే రోగాలే రావా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక బాలుర వసతి గృహం సమీపంలో రోడ్డుపై హాస్టల్‌కు సంబంధించిన మురుగునీరు ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే.. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు చెబుతున్నారు.రు. విషజ్వరాలు బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వేలంలో హుండీ, లడ్డూను దక్కించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మారుతి, సూరి, మల్లప్పతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



నిమజ్జనం ఘాట్ వద్ద పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్



మట్టి గణపతిని నిమజ్జనం చేసేందుకు వచ్చిన కుటుంబం



క్రేన్ ద్వారా ఎల్లెల్సీలో గణపతి నిమజ్జనం

గంగమ్మ ఒడికి గణనాథుడు

- వైభవంగా నిమజ్జనోత్సవం
- పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు
- రూ.1.16 లక్షలకు గణేశుడి హుండీని దక్కించుకున్న ఎమ్మెల్సీ మధుసూదన్
- రూ.3.60 లక్షలకు లడ్డూను దక్కించుకున్న భక్తులు

ఆదోని అర్బన్/ఆదోనిటౌన్/ఆదోని సెంట్రల్: పట్టణంలో లంబోదరుడి నిమజ్జనోత్సవం భక్త జనుల మధ్య కనుల పండువగా ఆదివారం జరిగింది. భక్త జనుల జైకారాలు, ఆనందోత్సవాల మధ్య ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన నిమజ్జనోత్సవం సోమవారం ఉదయం వరకు కొనసాగింది. ప్రధాన రహదారిలోని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ నేతృత్వంలో కొలువుదీరిన ఉండ్రాలయ్యకు వీహెచ్‌పీ, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. అంతకుముందు వినాయకుడి ప్రసాదంగా ఉంచిన లడ్డూ, హుండీకి ఉత్సవ కమిటీ పెద్దలు వేలం నిర్వహించారు. హుండీ వేలాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ రూ.1.16 లక్షలకు కైవసం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించగా మారుతి, సూరి, మల్లప్ప రూ.3.60 లక్షలకు దక్కించుకున్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా, పట్టణాధ్యక్షులు బసవన్నగౌడ్, హెగ్గటి ప్రతాప్, ఉత్సవ కమిటీ నాయకులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస ఆచారి, చెన్నబసవ, మారుతిరావు, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, ఎం.డి.బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం

వీహెచ్‌పీ కార్యాలయం నుంచి గణేశుడిని వాహనంలో ఉంచి అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా చిన్నహరివాణం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌కు చేరుకున్నారు. సంప్రదాయబద్ధంగా గణేశుడికి పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం నుంచి పట్టణంలోని ఆయా వీధుల్లో కొలువుదీరిన దాదాపు 400కు పైగా గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సుముహూర్తం కోసం మండప నిర్వాహకులు వేచి విగ్రహాలను కదిలించారు. దీంతో విగ్రహాల ఊరేగింపు ముఖ్యమైన పాత బస్టాండు కూడలికి చేరుకోవడానికి సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పట్టింది. విగ్రహాలన్నీ ఒకేచోటికి చేరుకోవడంతో పాత బస్టాండు కూడలి భక్తజన సంద్రంగా మారింది. నిమజ్జనోత్సవంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు లింగబేధం లేకుండా మేళతాళాలు, డోలు, శబ్దాలు, డీజేలకు అనుగుణంగా ఆధ్యాత్మిక ఆనందంతో మైమరిచి నృత్యం చేశారు. బాణసంచాలు పెద్ద ఎత్తున పేల్చారు.

అన్నదానం, దాహార్తి తీర్చిన దాతలు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఫొటో స్టూడియో నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా జంగమ సంఘం సభ్యులు, శారీస్ సెంటర్ నిర్వాహకులు అన్నదానం, దాహార్తి తీర్చారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. చిత్రాన్నం, షరబత్, ఉగ్గానీ, బజ్జీలు పంపిణీ చేశారు.



యువకుల విన్యాసం

భారీ బందోబస్తు

పట్టణం సున్నిత, సమస్యాత్మక ప్రాంతం కావడంతో ఉత్సవాలకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో ఏఎస్పీతో పాటు సీఐలు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లతో పాటు పోలీసు సిబ్బంది దాదాపు వెయ్యి మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిశీలించిన జిల్లా ఎస్పీ

ఆదోని పట్టణంలో జరుగుతున్న గణేష్ నిమజ్జనోత్సవంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమస్యాత్మక ప్రాంతాలను, గణేష్ నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఆయన డీఎస్పీ, సీఐలకు నిమజ్జనం బాగా జరిగేలా సూచనలు చేశారు. అదేవిధంగా సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పట్టణంలో తరలుతున్న గణనాథులను, గణేష్ ఘాట్‌ను పరిశీలించారు.



బదినేహాల్‌లో గణనాథుల ఊరేగింపు

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో ఆదివారం గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. గ్రామంలో కొలువైన గణేష్ విగ్రహాలను సాయంత్రం 4 గంటల నుంచి యువకుల నృతాలు, మేళతాలు, డప్పువాయిద్యాల నడుమ పుర వీధుల గుండా ఊరేగించారు. చిన్నారుల, యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుల ఊరేగింపు కార్యక్రమం కొనసాగగా గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేయించి నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. వల్లూరు, నదిచాగి గ్రామాల్లో కూడా నిమజ్జన కార్యక్రమం కొనసాగింది.



గణేశుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



భక్తులకు అన్నదానం చేస్తున్న వీహెచ్‌పీ, ఉత్సవ కమిటీ సభ్యులు



సూగూరేశ్వర స్వామి ఆలయ వద్ద భక్తులకు అన్నదానం

కోసిగి: మండల కేంద్రంలో కొలువుతీరిన గణనాథులకు ఐదవ రోజున ఘనంగా వీడ్కోలు పలికారు. ఊరువాకిలి సమీపంలోని సూగూరేశ్వర స్వామి ఆలయం వద్ద కొలువుతీరిన గణనాథుడి వద్ద పీఎస్ సుందరరాజు దొర, ఇల్లూరి భరద్వాజ్ శెట్టి హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కోసిగిలోని పలు కాలనీలలో కొలువుతీరిన గణనాథులను ట్రాక్టర్లపై కొలువుంచి డప్పు వాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని భరత్‌నగర్‌లో శ్రీ బాలాంజనేయ వినాయక మిత్రమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. డీజేలు హోరెత్తించగా భక్తులు నృత్యాలు చేస్తూ చిందులు వేశారు.





నిమజ్జనానికి తరలుతున్న పాండురంగ విఠల గణపతి, గణేశుడి శోభాయాత్రను వీక్షించేందుకు డివైడర్‌పై కూర్చొన్న భక్తులు



గణేశుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం,



గణనాథుడి ఊరేగింపులో చిందులు వేస్తున్న భరతనగర్ వాసులు

పార్టీ నేతకు పరామర్శ



గంగవరంలో ప్రహ్లాదరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

నందవరం: మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రహ్లాద రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. ప్రహ్లాద రెడ్డి క్యాన్సర్ వ్యాధితో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశ్వరరెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి కలిసి ఆదివారం ప్రహ్లాద రెడ్డిని పరామర్శించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తర్వాత అక్కడినుంచి బయలుదేరిన నాయకులను నందవరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క మల్లేశప్ప, లింగమూర్తి, ఒంటెద్దు లక్ష్మన్న శాలువా, పూలమాలలతో సన్మానించారు. సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయ మోహన్‌రెడ్డి, నాయకులు సోమశంకర రెడ్డి, నరసింహులు, రాముడు, రాఘవేంద్ర, రాజా రెడ్డి, జయరామిరెడ్డి, శివరామిరెడ్డి, దస్తగిరి, సోమేశ్వ రెడ్డి, తదితరులు ఉన్నారు.

‘తెలుగు తేజం’ గద్వాల సోమన్న



సోమన్నకు పురస్కారం అందిస్తున్న ప్రముఖులు

నందవరం: మండలంలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాల సాహిత్యవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్నకు శ్రీశ్రీ కళావేదిక అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ‘తెలుగు తేజం’ పురస్కారం వరించింది. ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించే తెలుగు భాషా సాహితీ సంబరాల కార్యక్రమంలో భాగంగా ఈ ఆవార్డు అందుకున్నారు. అనంతరం ఆయన రచించిన 77వ పుస్తకం »వేకువ చుక్క« పుస్తకావిష్కరణ ఈ కళావేదికపై నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదవలవాడ అరబిందబాబు, కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, తదితర ప్రముఖుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ గావించారు. 77 పుస్తకాలు ముద్రించి, పలు చోట్ల ఆవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న విశేష కృషికిగాను సత్కరించారు.

పవర్ గ్రిడ్‌కు సాగు భూములు ఇచ్చేది లేదు



మనేకుర్తి సమీపంలోని పొలాలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య

ఆలూరు రూరల్: పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం సాగులో ఉన్న భూములు ఇచ్చే ప్రసక్తే లేదని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని మనేకుర్తి గ్రామ పరిధిలో ప్రవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ప్రతిపాదించిన పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. అధికారులు రైతులపై ఒత్తిడి తెచ్చి బలంతంగా భూములు స్వాధీనం చేసుకునే కుట్ర పన్నితే రైతుల పక్షాన నిలబడి పోరాడతామని తెలిపారు. మనేకుర్తి,కమ్మరచేడు,హులేబీడు గ్రామాల పరిధిలో పవర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం చేపట్టిన 190 ఎకరాల భూమి 90 శాతం మనేకుర్తికి చెందిన చిన్న,సన్నకారు రైతులదేనని చెప్పారు. ఇదే ప్రాంతంలో వందలాది బీడు భూములు ఉన్నా పవర్ గ్రిడ్ కేంద్ర సంస్థ సాగు భూములు తీసుకోవడానికి ప్రయత్నించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. 2013 భూ హక్కు చట్టం ప్రకారం రైతుల అనుమతితో భూములు పొందాలని గుర్తుచేశారు. అధికారులు డీపీఆర్ మార్చి పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఇతర ప్రాంతానికి తరలించాలని కోరారు.

బీమా పరిహారం అందజేత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో కొన్ని రోజుల క్రితం మహాలక్ష్మీ (38) అనే మహిళ గుండెపోటుతో మృతి చెందడంతో భర్త రాఘవేంద్రకు రూ.4.75 లక్షల ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా మొత్తాన్ని ఆదోని బ్రాంచ్ మేనేజర్ సీఆర్.రామానుజన్ ఆదివారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మీ 2023లో రూ.5 వేలతో సరళ స్వధన్ పాలసీ తీసుకుని రెండు కంతులు చెల్లించిందని చెప్పారు. ఆమె గుండెపోటుతో మృతి చెందటంతో బీమా పరిహారం రూ.4,75,000 చెక్కును ఆదివారం ఆమె భర్తకు అందజేసినట్లు చెప్పారు. ఇన్సూరెన్స్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీల అభ్యున్నతే లక్ష్యంగా జాతీయ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు నూర్‌అహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన్ను నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ ఖాశింవలి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో జరిగిన ప్రతి ఎన్నికల్లో బీజేపీ అక్రమ ఓట్లతో మోసం చేసి గద్దెనెక్కిందన్నారు. దేశాభివృద్ధికోసం కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని వచ్చే ఎన్నికల్లో బీజేపీని తరిమికొట్టమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాలపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిక్కన్న గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు సావిత్రమ్మ తిక్కన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మృతుడి భార్య బాలమ్మకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిక్కన్న కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

రేపు వైఎస్సార్ వర్ధంతి

తుగ్గలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం తుగ్గలిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



పెద్దకడబూరులో అంగన్‌వాడీ సెంటర్-6 పక్కనే ప్రమాదకరంగా ఉన్న గుంత

అంగన్‌వాడీ పక్కనే గుంత

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రం పక్కనే (ఎంపీడీఓ కార్యాలయానికి పోయే ప్రధాన దారిలో) తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం పంచాయతీ ఆధ్వర్యంలో గుంతను తవ్వారు. తర్వాత దాన్ని పూడ్చడం సంబంధిత అధికారులు మరచిపోవడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ముప్పుగా మారింది. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు 3 నుంచి 5 సంవత్సరాలలోపే ఉంటారు. ఆటపాటలతో కేరింతలు కొడుతూ తిరిగే చిన్నారులు ఆ గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. గుంత చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో చిన్నారులకు అపాయం పొంచి ఉంది. ఇదే రోడ్డు గుండా ఎంపీడీఓతో పాటు సిబ్బంది, ఉన్నతాధికారులు రోజూ తిరుగుతున్నా ఒక్కరూ పట్టించుకోకపోవడం మరీ దారుణం. తాగునీటి కోసం పైప్‌లైన్ వేయడం మంచిదే కానీ చిన్నారుల భద్రత గురించి అధికారులు ఆలోచించాలని చిన్నారుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు వాపోతున్నారు. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్త చిట్టెమ్మ మాట్లాడుతూ.. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తికొండ: పంట చేతికొచ్చిన సమయంలో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో సాగు చేసిన ఉల్లి పంటకు మార్కెట్‌లో ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక అధికంగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఉల్లి పంటను క్వింటాకు రూ.3 వేల ప్రకారం ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గాజులదిన్నెకు జలకళ



గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిల్వ ఉన్న నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టుకు గత కొన్ని రోజులుగా హంద్రీ - నీవా, ఎల్లెల్సీ నీటి చేరిక కొనసాగుతుంది. అలాగే ప్రాజెక్టు ఎగువ ప్రాంతం తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, దేవనకొండ, ఆస్పరి, ఆదోని మండలాల్లో ఇటీవల కురిసిన వర్షానికి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. హంద్రీ నీవా నుంచి 190 క్యూసెక్కుల నీరు, ఎల్లెల్సీ నుంచి 70 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తోందని అధికారులు తెలిపారు. జీడీపీలో ఆదివారం సాయంత్రానికి నీటి నిల్వ 3.1 టీఎంసీలకు చేరిందని ప్రాజెక్టు ఏఈ తెలిపారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలుగా వెల్లడించారు. వరద నీరు, హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరు వచ్చి చేరడంతో జీడీపీ నీటితో కళకళలాడుతుంది.